క్లుప్తంగా

ప్రారంభమైన రంగనాయక స్వామి ఉత్సవాలు


బండ్లు ఊరేగిస్తున్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రాజం పేటలో కొలువైన శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం సాదాసీదాగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు ఆలయ ప్రధాన అర్చకులు రాకపోవడంతో గ్రామానికి చెందిన భక్తులు స్థానిక పురోహితులతో కార్యక్రమాన్ని నిర్వహించే ఏర్పాట్లను చేశారు. మొదటిరోజు ఉత్సవాల్లో భాగంగా ఆలయ అగ్రహారం సదాశివ గ్రామానికి చెందిన భక్తులు స్వామివారికి బండ్లను ఊరేగించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో గోవిందమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కమ్మరి నర్సింలు, రఘుపతిచారి, సోమరాజు చారి, శ్రీనివాస్‌చారి, రాజ్యలక్ష్మి, మంజుల, అమృతమ్మ, శ్యామల, స్వప్న యశోద, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు


దీక్ష చేస్తున్న అఖిల పక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షలు ఆదివారం నాటికి 35వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం డివిజన్ ప్రకటించే వరకు విశ్రమించమని, ఆందోళన తీవ్రతరం చేస్తామని అఖిలపక్షం నేతలు ప్రకటించారు. రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాలను కలుపుతూ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని వారు హెచ్చరించారు.

ఆంజనేయస్వామికి చందన అలంకరణ


స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం హనుమాన్ దీక్ష చేపట్టిన భక్తులు ఆంజనేయ స్వామికి చందన అలంకరణ చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

పౌరహక్కులపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌గేట్ వద్ద పోలీసులు ఆదివారం సివిల్ రైట్స్‌డే నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలంతా ఒక్కటేనని ఎవరిపైన చిన్నచూపు చూడొద్దన్నారు. గ్రామాల్లో ఎక్కడ రెండు గ్లాసుల పద్ధతి ఉండవద్దని చెప్పారు. అంటరాని తనం నేరమని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. మొబైల్ ఫోన్లలో ఎలాంటి లింకులు ఓపెన్ చేయొద్దని ఓటీపీ నంబర్ ఎవరికి చెప్పొద్దన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే పోలీసులకు తెలియచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాస్, పోలీసులు పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నర్సాపూర్: మండల పరిధిలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించనున్నారని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాజుయాదవ్, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్‌లు తెలిపారు.

వడగండ్లు.. రైతన్నకు కడగండ్లు


పాపన్నపేట(మెదక్): నేల రాలిన వరిపంట


పాపన్నపేట(మెదక్): మిన్‌పూర్‌లో తడిసిన ధాన్యం

పాపన్నపేట(మెదక్): వడగండ్ల వాన రైతన్నను కడగండ్ల పాలు చేసింది. ఆదివారం సాయంత్రం ఆకస్మాత్తుగా మండలంలోని పలు గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. దీంతో వరి పంట నేల రాలింది. మిన్‌పూర్, రామతీర్థం, ముద్దాపూర్, పాపన్నపేట కుర్తివాడ గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. సుమారు 15 నిమిషాల పాటు గాలి, వడగండ్ల వాన పడింది. దీంతో చేతి కొచ్చిన పంట రాలి పోయింది. కొనుగోలు కేంద్రాల్లో ఆర బోసిన ధాన్యం తడిసి పోయింది.

పేటలో ఈదురుగాలులతో వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పంటలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రేగోడ్ లో భారీ వర్షం

రేగోడ్(మెదక్): మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పంటలు మళ్లీ దెబ్బ తింటాయేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం భారీగా కురవడంతో జన జీవనం స్తంభించింది.


రేగోడ్(మెదక్): మండల కేంద్రంలో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


రామాయంపేట(మెదక్): ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రామాయంపేట(మెదక్): మండలంలోని లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1997–98 సంవత్సరంలో ఈ పాఠశాలలో చదువుకున్న వారంతా సమావేశమై గత స్మృతులు నెమరు వేసుకున్నారు. ఈసందర్భంగా వారు ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానించారు. మృతి చెందిన హెచ్‌ఎం కరుణాకర్‌కు వారు నివాళులర్పించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం


వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి గ్రామంలో కొలువైన పురాతన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పండితులు ప్రత్యేక పూజలు చేసి, వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దివంగత ఆలయ ధర్మకర్త వెంకట్‌గోపాల్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. మే 9 వరకు దొంతి వేణుగోపాలస్వామి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తాం


మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని మహ్మద్‌నగర్ సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కౌడిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో 18 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పారదర్శకంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నమన్నారు. వరిధాన్యంలో పొల్లు, మట్టిపెడ్డలు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం తూకం వేస్తామన్నారు. వర్షాలు పడుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రులను కలిసిన నేతలు


మంత్రి సత్యవతిరాథోడ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సునీతారెడ్డి తదితరులు

నర్సాపూర్: ఆదివారం రాష్ట్ర సచివాలయ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు మంత్రులను నర్సాపూర్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడి పలువురు నాయకులు సీఎం కేసీఆర్‌తో పాలు మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, సబిత ఇంద్రారెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా మంత్రులను కలిసినప్పుడు వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి ,పలువురు ప్రజాప్రతినిధులతోపాటు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఉత్సవాలకు రావాలని ఆహ్వానం


ఎంపీపీ శ్రీనివాస్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు రావాలని ఎంపీపీ మాసుల శ్రీనివాస్‌తో పాటు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. మే 5 నుంచి 9 వరకు నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొనాలని ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు స్థానిక నాయకులకు ఆహ్వాన పత్రికలు అందిస్తున్నట్లు గౌడ సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్‌గౌడ్, నరేశ్, రాంచందర్, శంకర్, నర్సింలు, ప్రభాకర్, వెంకట్, లక్ష్మీనారాయణ, విశ్వేశ్వర్‌రావు ఉన్నారు.

వర్షంతో కరెంట్‌కు అంతరాయం

నర్సాపూర్: ఆదివారం కురిసిన వర్షంతో నర్సాపూర్ పట్టణంలోని పలు కాలనీల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని ధర్మశాల సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇన్సూలేటర్ పేలింది. దీంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం భారీగా వర్షం కురిసింది. వర్షం కారణంగానే ఇన్సూలేటర్ పేలిందని విద్యుత్‌శాఖ అధికారులు చెప్పారు. మండల విద్యుత్ ఏఈ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది పేలిన ఇన్సూలేటర్‌ను తొలగించి, కొత్తది ఏర్పాటు చేసి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు.

ఆహ్వానం


మందకృష్ణకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కాళ్లకల్ గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో అరుంధతీయ బంధుసేవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రముఖులు వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుదూ.. మేడే రోజు గ్రామంలో విగ్రహావిష్కరణకు రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాదిగ రిజర్వేషన్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ప్రజాగాయకుడు గద్దర్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కాగా ఆదివారం బంధుసేవ సభ్యులు మందకృష్ణ మాదిగకు కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

నేటి నుంచి నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు ముత్యాలుగౌడ్ ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 1న గణపతి పూజ, పుణ్యహవాచం, 2న స్వస్తివాచనం, పుష్పాదివాసం, ఫలాదివాసం, శయ్యాదివాసం, 3న యంత్రస్థాపన నిర్వహిస్తామని వివరించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


రామాయంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంఘం చైర్మన్ చంద్రం

రామాయంపేట(మెదక్): పట్టణ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కోమటిపల్లి, రామాయంపేట ఎస్సీ కాలనీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ చంద్రం ప్రారంభించారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించాలని వారు సూచించారు. కార్యక్రమంలో సరాపు యాదగిరి, మున్సిపల్ కౌన్సిలర్లు అనిల్ కుమార్, దేమె యాదగిరి, సుందర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం ఇస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన గోనెమైసమ్మ ఆలయ అభివృద్ధికి శివ్వంపేట జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆదివారం విరాళం అందజేశారు. వెల్దుర్తి మండలంలోని గోనెమైసమ్మ ఆలయ అభివృద్ధికి సాయం చేయాలని ఆలయ కమిటీ కోరిక మేరకు రూ.50 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారావు, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, వీరేష్, లక్ష్మీనర్సయ్య, సంతోష్ తదితరులు ఉన్నారు.

పంట వివరాల సేకరణ


పెద్దశంకరంపేట(మెదక్): జూకల్‌లో పంటను పరిశీలిస్తున్న ఏఈఓ మమత

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో నష్టపోయిన పంట వివరాలను సేకరించారు. ఆదివారం మండల పరిధిలోని రామోజిపల్లి, జూకల్, వీరోజిపల్లి తదితర గ్రామాల్లో అకాల వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను ఏఈఓ మమత సేకరించారు. వరిపంటతో పాటు మొక్కజొన్న, జొన్న పంటలను ఆమె పరిశీలించారు. పంటనష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు.

ఆలయాల్లో భక్తుల సందడి


కౌడిపల్లి(నర్సాపూర్): బోనాలతో భక్తులు


నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేష్ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు మంచినీరు, వసతితో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి, సిబ్బంది నర్సింహారెడ్డి ఉన్నారు.

ప్రధాని మన్ కీ బాత్ వీక్షణ


నర్సాపూర్‌లో మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు


మనోహరాబాద్(తూప్రాన్): కాళ్ళకల్‌లో ..


పెద్దశంకరంపేటలో..

నర్సాపూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. స్థానిక చౌరస్తాలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ప్రజలతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు రాజేందర్, బుచ్చేష్‌యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ మాట్లాడుతూ.. హామీల అమలులో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమాన్ని విస్మరించి ఇతర రాష్ట్రాల రైతుల కోసం ర్యాలీలు చేపట్టడం విచారకరమని ఆరోపించారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్‌లో బీజేపీ నాయకులు మన్‌కీబాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌చారి, బీసీ సెల్ నాయకుడు ప్రభాకర్‌గౌడ్, మండల యూత్ విభాగం నాయకులు తదితరులున్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని పేటలోని బీజేపీ కార్యాలయంలో ప్రజలు, బీజేపీ నాయకులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోణం విఠల్, నాయకులు శ్రావణ్, బుగుడాల కృష్ణ, దమ్ము సాయిలు, కిషన్‌రాథోడ్, విలాస్, రవి ఆయా గ్రామాల కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు బీటలు


బహిరన్‌దిబ్బ- ముస్లాపూర్ మధ్య లేచిపోయిన బీటీ

అల్లాదుర్గం(మెదక్): ప్రజాధనం పక్కదారి పడుతుంది. గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ. కోట్లు మంజూరు చేస్తుంటే పనులు నాణ్యత లోపంతో చేపడుతున్నారు. ఇలా రోడ్డు వేస్తే.. అలా లేచిపోతుంది. బీటీ రోడ్డు పనుల్లో నాణ్యతను పట్టించుకోకపోవడంతో కొన్ని నెలల్లోనే రోడ్డు ధ్వంసమవుతుందని స్థానికులు చెబుతున్నారు.

- ప్రభుత్వం 2021లో ముస్లాపూర్ నుంచి బహిరన్‌దిబ్బ గ్రామ చౌరస్తా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 3 కోట్ల 44 లక్షలు మంజూరు చేసింది. అప్పట్లో అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.
- ఈ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేందుకు మూడేళ్లు పట్టింది. పనుల్లో నాణ్యత లోపించడంతో బీటీ వేసిన నెల రోజులకే లేచి పోయింది.
- పనులు పూర్తి చేసేందుకు మూడేళ్లు పడితే.. పాడవడానికి నెల రోజులే పడుతుందని ప్రజలు వాపోతున్నారు.
- అధికారులు పర్సంటేజీలకు కక్కుర్తి పడడంతో పనుల్లో నాణ్యత కొరవడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- బహిరన్‌దిబ్బ గ్రామంలో బీటీ రోడ్డు పనులు చేపడుతున్నప్పుడే గ్రామస్తులు పనులు అడ్డుకుని పీఆర్ డీఈఈని నిలదీశారు.
- గతంలో ఇదే రోడ్డు బీటీ చేస్తే ఏడాదికే కంకర తేలడంతో తీవ్ర అవస్తలు పడటమే కాక ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు.
- ఇటీవల ఈ రోడ్డు నాణ్యతకు అధికారులు విచారణకు రాగా ఎక్కడ నాణ్యతతో వేశారో అక్కడే చూయించారు.


పీఆర్ డీఈఈని నిలదీసిన గ్రామస్తులు (ఫైల్)

- విచారణకు వచ్చిన అధికారులకు బీటీ లేచిపోయింది. అధ్వానంగా వేసిన రోడ్డు కనిపించకపోవడం గమనార్హం.
- ఈ విషయంపై పీఆర్ డీఈఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా పనులు చేసి నెల రోజులు అయిందని చెప్పారు. ఐదేళ్ల వరకు కాంట్రాక్టర్‌దే బాధ్యత అన్నారు.
- రోడ్డు ఎక్కడైన పాడైతే కాంట్రాక్టర్ ఐదేళ్ల వరకు మరమ్మతులు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

రెడ్డిపల్లిలో కాంగ్రెస్ ఆత్మగౌరవ యాత్ర

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లికాలనీతో పాటు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి కాలనీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒకేసారి రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. ధరణి రద్దు చేసి భూ వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక పోర్టల్‌ను తీసుకొస్తామన్నారు. నాయకులు నవీన్, స్టాలిన్, అంజనేయులు, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.